## క్లుప్తంగా

### వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని వినతి



మంగళగిరి, మంగళగిరి టౌన్: వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో స్థానిక జాయింట్ యాక్షన్ కమిటీ తరఫున గురువారం మంగళగిరి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉందని.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 25, 26, 29 ప్రకారం రాజ్యాంగ హక్కులకు భంగం కలిగిస్తుందని.. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుందని ఆ వినతి పత్రంలో ప్రస్తావించారు. కార్యక్రమంలో మంగళగిరి జేఏసీ కన్వినర్ మొహమ్మద్ యూసఫ్, సభ్యులు రషీద్, అబ్దుల్ అజీమ్, బాబావలి, ఫరీద్దీన్, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### నట్లల నివారణ మందు పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని కొండవీడుపాడు గ్రామంలో గురువారం గొర్రెలకు నట్టల నివారణ మందు నుదురుపాడు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నట్టల నివారణ మందు జీవాలకు అందించడం ద్వారా గొర్రెల జీర్ణక్రియ మెరుగుపడుతుందని చెప్పారు. కడుపులో ఉన్న పురుగుల వల్ల ఆహారం సరిగా జీర్ణం కాదని.. నట్టల నివారణ మందులు వేయడం ద్వారా జీర్ణం సరిగా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### సమ్మెను జయప్రదం చేయాలి



ఫిరంగిపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి అన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. ఆయన కార్మికులతో మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల నాయకులు ఇబ్రహీం, నరేష్, అశోక్, బాలయ్య, రామారావు, సామ్యూల్ పాల్గొన్నారు.

### పొలాల మధ్య మురుగు కాలువ పూడ్చివేత



దుగ్గిరాల: వర్షాకాలంలో పొలంలో అధిక నీరు బయటకు పోయేందుకు వీలు లేకుండా తన పొలం ఎదురుగా ఉన్న కాలువను పూర్తిగా ఓ రైతు పూడ్చేశారు. వివరాలలోకి వెళ్తే.. శృంగారపురం గ్రామ శివారు పొలంలో ముప్పా చంద్రశేఖర్ అనే రైతు తన పొలం ఎదురుగా ఉన్న మురుగు కాలువను పూర్తిగా పూడ్చారు. దీంతో పై ఎత్తున ఉన్న పొలాలు 50 ఎకరాలకు ప్రవహించే మురుగు పోకుండా పంట నీట మునిగి, రైతులు నష్టపోనున్నామని మరో రైతు ముసునూరు సాంబశివరావు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి పొలాల మధ్య మురుగు కాలువను పునరుద్ధరించాలని పై 50 ఎకరాల రైతులు కోరుతున్నారు.

### ఘనంగా ఎస్వీ రంగారావు జయంతి



తాడేపల్లి రూరల్: విశ్వ నట చక్రవర్తి, నటసార్వభౌమ ఎస్వీ రంగారావు 107వ జయంతిని గురువారం తాడేపల్లి విజయవాడ క్లబ్ రోడ్‌లోని పూలమార్కెట్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎస్వీ రంగారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి అధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు మాట్లాడుతూ.. ఎస్వీ రంగారావు సినీ రంగానికి ఎనలేని సేవలు చేశారని.. పౌరాణిక, సాంఘిక పాత్రలలో తన నట విశ్వరూపాన్ని ప్రదర్శించి తెలుగు ప్రేక్షకుల మనసులను దోచుకున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు పల్లెపు భాస్కరరావు, ఉపాధ్యక్షులు పలివేటి రమేష్, కార్యదర్శి అద్దేపల్లి నక్కా నవీన్‌రాజా, యువజన అధ్యక్షుడు రమణ, ఉపాధ్యక్షుడు దుర్గారావు, ప్రజా కార్యదర్శి ఆదిమూల నరేష్, కోశాధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సాగు.. మెళకువలతో రైతన్న బాగు

- ప్రారంభమైన ఖరీఫ్
- నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు
- కొనుగోళ్లలో రసీదులు తప్పనిసరి

తాడేపల్లి రూరల్: వరుణుడు ముందస్తుగా కరుణించడంతో ఖరీఫ్ సాగు జోరందుకుంది. ఆయా మండలాల పరిధిలో వరి, మిరప, కంది, మినుము, పెసర, ఉల్లి, మొక్కజొన్న, తదితర పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఆయా పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు విత్తన ఎంపిక, కొనుగోలులో మెళకువలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నకిలీ బెడద ఎక్కువగా ఉన్నందున విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలులో విధిగా బిల్లు తీసుకోవడం అత్యవసరం. విత్తనాలు, ఎరువులకు సంబంధించి అనుమానం వస్తే సంబంధిత ఆగ్రి ఇంటిగ్రేటెడ్ ల్యాబుల్లో ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చు.



విత్తనాలు



పురుగు మందులు

#### విత్తన కొనుగోలు..

వ్యవసాయ శాఖ నుంచి అనుమతి పొందిన, ఆథీకృత డీలర్ల నుంచి మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. విత్తనాల కొనుగోలు సమయంలో డీలర్ల వద్ద నుంచి తప్పని సరిగా బిల్లులు పొందాలని చెబుతున్నారు. లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనరాదని.. గడువు దాటిన విత్తనాలను తీసుకోరాదని.. బిల్లుపై విక్రయదారుడి పేరు, కేంద్రం, రాష్ట్ర అమ్మకపు పన్ను నెంబరు, రైతు పేరు, గ్రామం పేరు, రైతు, విక్రయ దారుడి సంతకం, తేదీలు, రకం పేరు, బ్యాచ్ నెంబరు, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పని సరిగా నమోదు చేయాలని అధికారులు అంటున్నారు. అంకె కాకుండా కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్, సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందా లేదా నిర్ధారించుకోవాలి. పంటకాలం పూర్తి అయ్యే వరకు బిల్లులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. విక్రయ దారుడు ఇచ్చే కరపత్రాల్లో పేర్కొన్న అంశాలను చదవాలి. మొలకెత్తే దశ, పూత దశలలో పంటలో లోపం కనిపిస్తే వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలి. విత్తనం కొనుగోలు చేసిన వెంటనే పరీక్షించాలి. మొలక శాతం సంతృప్తిగా ఉన్న వాటిని మాత్రమే ఎంపిక చేసుకోవాలి.

#### ఎరువుల కొనుగోలులో..

లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే ఎరువులను కొనుగోలు చేయాలి. బిల్లు, ఖాళీ సంచులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచాలి. మిషన్ కుట్టుతో ఉన్న ఎరువు సంచులు మాత్రమే వాడాలి. ఒక వేళ చేతి కుట్టు ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తి దారుడి పేరు ఖచ్చితంగా ఉండాలి. కొనుగోలు సమయంలో డీలర్ రసీదులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షకు పంపాలి. చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలు కొనుగోలు చేయరాదు.

#### పురుగు మందుల కొనుగోలు సమయంలో..

చీడ పీడలకు వినియోగించే క్రిమి సంహారక మందుల కొనుగోలు సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలుపుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన పురుగుమందులనే ఉపయోగించాలని అంటున్నారు. అవసరానికి మించి కొనుగోలు చేసిన, నిల్వ ఉంచిన పురుగు మందులను వాడరాదని.. లైసెన్సు ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని.. పురుగు మందు డబ్బాలపై వజ్రాకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయని.. అత్యంత విష పూరితమైతే నీలిరంగు, స్వల్ప విష పూరితం అయితే ఆకుపచ్చ రంగు గుర్తులు ఉంటాయని నిపుణులు అంటున్నారు.

#### తగిన జాగ్రత్తలు అవసరం..



ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎరువులు, విత్తనాలకు సంబంధించి ఏదైనా అనుమానం వస్తే ల్యాబ్‌లో నాణ్యతను పరిశీలించుకోవచ్చు. విత్తనాలు, ఎరువులు ఎక్కడపడితే అక్కడ కొనుగోలు చేయకూడదు. ఇలా చేస్తే మోసపోయేందుకు అవకాశం ఉంటుంది. లైసెన్స్ కలిగిన డీలరు వద్దనే కొనుగోలు చేయాలి. సంబంధించిన బిల్లును అడిగి తీసుకుని భద్రపరుచుకోవాలి. లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయవద్దు. రైతులు మోసపోకుండా వ్యవసాయ శాఖ అన్ని చర్యలు తీసుకుంటోంది.

– పి.శిరీష, తాడేపల్లి మండల వ్యవసాయ అధికారి

### ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు కృషి



ఫిరంగిపురం: ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీసీఈవో వి.జ్యోతిబసు అన్నారు. మండల కేంద్రం, గొల్లపాలెం గ్రామాల్లో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా చెత్తసేకరణ, పరిసరాల శుభ్రత తీరును పరిశీలించారు. కోనేటి చెరువును పరిశీలించి నీటిలో కలిపే క్లోరినేషన్ విధానం వివరాలు అడిగి తెలుసుకున్నారు. మన వ్యర్థ పదార్థాల నిర్వహణ, షెడ్ల తీరుతెన్నులను సంబంధిత శాఖ అధికారులను వివరాలు అడిగారు. షెడ్లలో చెత్త వ్యర్థ పదార్థాల సేకరణ, వర్మీ కంపోస్టు తయారీ, స్టాకు అమ్మకాలు, నిల్వల గురించి రికార్డులు పరిశీలించారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల తీరుతెన్నులు, పరిసరాలు శుభ్రంగా ఉంచే విధానం, క్లాప్ మిత్ర, గ్రీన్ అంబాసిడర్ల నిర్వహణ గురించి పంచాయతీ కార్యదర్శులకు తగిన సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ ఈవో ఏకే బాబు, పలు గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు ప్రభుత్వ రాయితీలను వినియోగించుకోవాలి

మంగళగిరి టౌన్: రైతులు ప్రభుత్వ రాయితీలను వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ డిల్లీరావు రైతులను కోరారు. మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో పాటు వ్యవసాయానికి అవసరమయ్యే పరికరాలను అందజేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వినియోగించుకోవాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్, ఉద్యానవన అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, మంగళగిరి ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి శైలజా రాణి, మండల ఉద్యానవన అధికారి దీపిక, ఏపీ సీఎం ఆర్ డీపీఎం రాజకుమారి, ఏఈవోలు, వీఏలు, వీహెచ్‌ఏలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: పెదవడ్లపూడి భగవాన్ శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిరం గోమాత–గోశాలను గురువారం వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ డైరెక్టర్ డిల్లీరావుతో కలిసి సందర్శించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామంలోని రైతులు, వ్యవసాయ అధికారులతో జరిగిన సమావేశానికి హాజరై అనంతరం గోశాలను పరిశీలించారు. గోశాల నిర్వహణ గురించి గోశాల కన్వీనర్ పాతూరి శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హార్టి కల్చరల్ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రాజకుమారి, మంగళగిరి పశువైద్యశాల ఏడీ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి శైలజ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

### విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

ఫిరంగిపురం: మండలంలోని మూడు గ్రామాలకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ గురువారం తెలిపారు. మేరికపూడి, మునగపాడు, పొనుగుపాడు గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### బండారుపల్లిలో డీపీవో ఆకస్మిక పర్యటన



బండారుపల్లి(తాడికొండ): మండలంలోని బండారుపల్లి గ్రామంలో డీపీవో నాగసాయి కుమార్ గురువారం ఆకస్మిక పర్యటన నిర్వహించారు. గ్రామంలో పారిశుద్ధ్యం పరిశీలించిన అనంతరం, ఇంటింటికీ చెత్త సేకరణపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా మెరుగైన పారిశుద్ధ్యం నిర్వహణ చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముప్పాళ్ల మనోహర్, ఈవోపీఆర్డీ సాయిలీల, కార్యదర్శి అల్లడి రామారావు పలువురు అధికారులు పాల్గొన్నారు.

### రైతులకు బిల్లులు తప్పకుండా ఇవ్వాలి

దుగ్గిరాల: రైతులకు అనుమతి లేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించవద్దని మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయకుమారి అన్నారు. దుగ్గిరాలలో గురువారం డీలర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1996 విత్తన చట్టం ప్రకారం, విత్తనాలు అమ్మే విషయంలో రైతులందరికీ బిల్లులు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు. అనుమతి ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలని డీలర్లకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల గ్రామాల డీలర్స్ పాల్గొన్నారు.

### రెండో విడత ల్యాండ్ పూలింగ్‌ను విరమించుకోవాలి

మంగళగిరి టౌన్: మరోసారి రాజధానికి ల్యాండ్ పూలింగ్ పేరుతో మరో 44 వేల ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని ఏపీ ప్రదేశ్ రైతు సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని సంఘం నాయకులు పేర్కొన్నారు. మంగళగిరి రూరల్ కాజ గ్రామంలో పాల కేంద్రం వద్ద రైతులతో జనరల్ బాడీ సమావేశాన్ని రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం తాజాగా ల్యాండ్ పూలింగ్ రెండో విడత తెరమీదకు తీసుకురావడంతో ప్రస్తుత రాజధాని ప్లాట్ల ధరలు పడిపోయాయని చెప్పారు. జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, రైతు సంఘం నాయకులు ఈశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ, గ్రామ రైతు ఈదా ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేనేం పాపం చేశాను తాతా!!

పోషించలేక, సంరక్షించలేక మనవరాలిని మట్టుబెట్టిన తాత



నిందితుడు మాధవరావు(బుల్లి)

తాడేపల్లి రూరల్: పుట్టిగా లోకం తెలియని బాలిక.. పుట్టుకతోనే మూగ, చెవుడు. పుట్టిన ఏడాదికే తల్లిని కోల్పోయింది. ఎనిమిదో ఏట విధి వక్రించడంతో తండ్రిని కూడా కోల్పోయింది. అప్పటి నుంచి నాయనమ్మ, తాతయ్య దగ్గర పెరుగుతోంది. బాలికకు మతిస్థిమితం లేదని కంటికి రెప్పలా చూసుకుంటూ సంరక్షిస్తున్నారు. కాలం కలిసి రాక నాయనమ్మ మంచాన పడింది. దీంతో బాలికను సంరక్షించలేక సొంత తాతే ఆ మనవరాలిని మట్టుబెట్టాడు. ఐదేళ్ల కిందట జరిగిన ఈ ఘటనపై పోలీసులు నిందితుడిగా తాత మాధవరావును గుర్తించి గురువారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విచిన వర్గాలు అందించిన సేకరించిన వివరాల ప్రకారం.. కూరపాటి మాధవరావు(బుల్లి), సుమతి దంపతుల కుమారుడు రాజు. రాజు భార్య బుజ్జి. వీరికి హేమ జన్మించింది. హేమకు పుట్టుకతోనే చెవుడు, మూగతో మతిస్థిమితం. హేమ ఏడాది వయస్సులో తల్లి బుజ్జి రెండో సారి గర్భం దాల్చగా కాన్పు సమయంలో ధనుర్వాతం వచ్చి మృతి చెందింది. తండ్రి రాజు హేమకు 8 ఏళ్ల వచ్చే సమయానికి మృతి చెందాడు. అప్పటి నుంచి వారి నాయనమ్మ సుమతి, తాతయ్య మాధవరావు సంరక్షణలో హేమ ఉంది. హేమకు 13 ఏళ్లు వచ్చాయి. నాయనమ్మ సుమతి అనారోగ్యం బారిన పడడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. తాతయ్య మాధవరావు మనవరాలు హేమను ఇంటి నుంచి ఆసుపత్రికి, అక్కడి నుంచి ఇంటికి తనతో తిప్పుకొంటూ గత నాలుగు రోజుల నుంచి చూసుకుంటున్నాడు. మతిస్థిమితం గల మనవరాలిని మేము లేకపోతే ఎవరు చూసుకుంటారన్న ఆలోచన.. తమ తదనంతరం బాలికను ఎవరు సాకుతారన్న ఉద్దేశ్యంతో తాత మాధవరావు పాపను కడతేర్చాలని నిర్ణయించుకున్నాడు. దీంతో మంగళవారం రాత్రి జాతీయ రహదారిపై కుంచనపల్లి వద్ద బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి మీద నుంచి బాలికను కాలువలోకి తోసి కడతేర్చాడు. ఘటనపై సీఐ వీరేంద్రబాబును వివరణ అడుగగా.. బాలికను హత్యచేసిన తాతయ్యను అదుపులోకి తీసుకున్నామని, పూర్తి విచారణ అనంతరం కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు.

## బాల్య వివాహాలు నియంత్రించాలి

మేడికొండూరు: బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎ.అనూరాధ అన్నారు. మండల కేంద్రమైన మేడికొండూరు, మంగళగిరి పాడు గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్–క్రాఫ్ ఆధ్వర్యంలో బాల్య వివాహ వ్యతిరేక ప్రచారోద్యమం వీధి నాటక ప్రదర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు అరికట్టేందుకు సామాజిక మార్పు తీసుకువచ్చే కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాలన్నారు. ఇలాంటి వీధి నాటకాలతో సమాజంలో ఉన్న సాంఘిక దురాచారాలు తొలగించవచ్చన్నారు. మేడికొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.జయప్రద మాట్లాడుతూ.. సమాజంలో బాలికలపై అనేక రకాల వివక్షలు జరుగుతున్నాయన్నారు. వాటిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో క్రాఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ జి.వెంకట్, ఫిరంగిపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్, మేడికొండూరు సెక్టార్ సూపర్‌వైజర్ సునీత, సిబ్బంది మోహన్ రావు, శ్రీనివాసరావు, సుభాషిణి, కాంతిశ్రీ, పద్మజ, శైలజ, కుమారి, జేమ్స్, ద్వారా యానిమేటర్స్ ద్వారా లీడర్స్, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ మెంబర్స్, వీధి నాటక కళా బృందం సభ్యులు రవి కుమార్, రాము, రంగనాయకి, గ్రావణి, మహేష్, దిన్ని, పలువురు విద్యార్థులు అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

## 55 ఏళ్లు నిండిన మెకానిక్‌లకు పింఛను ఇవ్వాలి

మంగళగిరి టౌన్: 55 సంవత్సరాలు నిండిన బైక్ మెకానిక్‌లకు పెన్షన్ అర్హులుగా గుర్తించాలని శ్రామికుల టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. అంతర్జాతీయ మెకానిక్ డే సందర్భంగా మంగళగిరి నగర పరిధిలోని గౌతమ బుద్ధ రోడ్‌లో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా ఆరోగ్య కార్డులు ఇవ్వాలని కోరారు. టూ వీలర్ మెకానిక్‌లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సబ్సిడీ ద్వారా లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ సమావేశ మందిరానికి 10 సెంట్ల స్థలం కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు షేక్ సలీమ్, బాపనపల్లి వాసు, తిరుపేడులు వెంకట సుబ్బారావు, ప్రభాకరరావు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద మీడియాతో మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

## కార్మికుల సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు వేములు దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో నారా లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినపుడు తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, కాబట్టి కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌రావు, సాంబశివరావు, ఇస్మాయిల్, హర్షయ్య, కార్మికులు నవనీతమ్మ, రమణమ్మ, శారదమ్మ, రిబ్కా, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని తాపీ మేస్త్రి దుర్మరణం

మేడికొండూరు: రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని వెనుక వస్తున్న కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని పేరేచర్ల గుంటూరు రోడ్‌లోని వంద్రాయ పెట్రోల్ బంకు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన షేక్ నాగూర్ భాష(45) తాపీ మేస్త్రిగా జీవనం సాగిస్తున్నాడు. పని ముగిసిన అనంతరం తన స్నేహితుడితో కలిసి పెట్రోల్ కొట్టించేందుకు పెట్రోల్ బంకు వద్దకు వచ్చాడు. నాగూర్ భాష బైక్ దిగి రోడ్డుపై ఉండగా పేరేచర్ల నుంచి వస్తున్న కారు నాగూర్ భాషను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య మదార్‌బీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మేడికొండూరు పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులో జాతీయ డెంగీ మాసోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. డెంగీ, మలేరియా వ్యాధులు కలిగించే దోమల ఉధృతి తొలగించాలంటే శుభ్రత పాటించాలని చెప్పారు. నీరు నిలువ ఉంచడం ద్వారా దోమలు పెరిగి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ పాఠశాల హెచ్ఎం లింగంశెట్టి, సాంబయ్య, ఎంపీహెచ్ఏ బాబు రావు, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం అంతోని రాణి, ఆశా కార్యకర్తలు సుజాత, పద్మ, శాంతకుమారి, జోజమ్మ, శాంతారాణిలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

## పగుళ్లు తీసిన సిమెంట్ రోడ్డు!



ఉండవల్లి గుంటూరు చానల్ కరకట్ట వెంబడి ఉండవల్లి బ్రిడ్జి దగ్గర నుంచి కొండవీటి వాగు ఎత్తిపోతల వరకు నిర్మించిన జీటీ రోడ్డుకు అనుసంధానంగా కొండవీటి వాగు నిల్వచేసే సంపు పైభాగంలో ఇరిగేషన్ అధికారులు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేశారు. గతేడాది అధిక వర్షాలు కురవడం.. ఇటుగా తరచూ భారీ వాహనాలు తిరగడంతో సుమారు 20 అడుగుల పొడవున సిమెంట్ రోడ్డు పగుళ్లు తీసింది. దీంతో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదమరిచి ఎవరైనా ప్రయాణించినా, నడిచినా ఆ పగిలిన గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ఈ రహదారిలో ఉన్న పగుళ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– తాడేపల్లి రూరల్

## నాలుగో రోజుకు చేరిన కార్మికుల నిరసన

మంగళగిరి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమం గురువారానికి నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు తమ నోటిలో గడ్డి, ఆకులు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంజినీరింగ్ కార్మికులకు అమలు చేయాలని, జీవోల ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు ఎస్‌ఎస్ చెంగయ్య, ఫణి, ఎం.రాజేష్, ఎం.బాలాజీ, ఆంధ్రప్రదేశ్ చేతి కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.బాలకృష్ణ, యూనియన్ నాయకులు కె.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, కేదారనాథ్, ఎన్ ప్రకాష్, దుర్గారావు, పి.రాము పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు